క్లుప్తంగా

కమనీయం శ్రీవారి కల్యాణం



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

వల్లూరు (చెన్నూరు) : రథసప్తమి సందర్భంగా స్థానిక ట్రంకు రోడ్డులోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి (కోట్లస్వామి), సరస్వతి నగర్‌లోని శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాలలో శ్రీవారి కల్యాణం మంగళవారం కమనీయంగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కల్యాణం మధ్యాహ్నం 12 గంటలకు ముగిసింది. తెల్లవారుజాము నుండి స్వామివారికి ప్రత్యేక అలంకరణలతో పాటు అభిషేకాలు, అర్చనలు గావించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

జమ్మలమడుగు : పట్టణంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక నారాపురస్వామి ఆలయంలో భూదేవి, శ్రీదేవి సమేతుడైన దేవదేవుడికి రథోత్సవాన్ని నిర్వహించారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పాత బస్టాండులో వెలసిన శ్రీపద్మావతి సమేత కల్యాణ శ్రీ వేంకటరమణస్వామి ఆలయంలో శుక్రవారం అంకురార్పణతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ముందుగా రథసప్తమి సందర్భంగా స్వామి వారిని సూర్యభగవానుడి అలంకారంలో పట్టణ పూలంగళ్ల సర్కిల్ వద్ద సూర్యప్రభ వాహనంపై స్వామివారిని ప్రత్యేక వాహనంలో కొలువుతీర్చి సూర్య ప్రతిబింబాలు పడేవరకు అక్కడే పూజలు నిర్వహించారు.

ఘనంగా మహా కుంభ నివేదన

పులివెందుల టౌన్ : పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో వీరభద్రునికి మహా కుంభ నివేదనను అర్పించారు. స్వామివారి ముందు అన్నం రాశిగా పోసి అందులో వివిధ రకాల కూరగాయలు, పంచామృతం, అప్పలను నైవేద్యంగా పెట్టి మహా మంగళ హారతులను పట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గండి నిత్యాన్నదానానికి రూ.50,116 వితరణ

చక్రాయపేట : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీగండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో మంగళవారం ప్రొద్దుటూరు గురవయ్య తోటకు చెందిన దాత వెంకటరెడ్డి, ఆదిలక్షుమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు నిత్యాన్నదానానికి రూ.50,116ల నగదును విరాళంగా ఇచ్చారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ ప్రధాన అర్చకులు కేసరిస్వామి, మాజీ చైర్మన్ వెంకటస్వామిలు కండువా వేసి తీర్థ ప్రసాదాలను అందించారు.

ఆర్థిక సాయం

వేంపల్లె : పట్టణంలోని రెడ్డయ్య కాలనీలో నివసిస్తున్న ఎం.విజయకుమార్ సోదరి ఎం.సరోజమ్మ గత రాత్రి అనారోగ్యంతో మరణించారు. ఆమె అంతిమ సంస్కారాలను నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మానవతా సంస్థ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. రూ.5000 ఆర్థిక సహాయం అందించగా, అడ్వైజరీ బోర్డ్ సభ్యులు ఫారెస్టర్ మధు రూ.1000, రెడ్డయ్య కాలనీకి చెందిన సిద్దులు, ఈశ్వర్ రూ.500లు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛద సేవా సంస్థ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి, కో చైర్మన్ కావలి కృష్ణతేజ, కన్వీనర్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సాయం

పులివెందుల టౌన్ : పట్టణంలో రెడ్డి కమ్యూనిటీ డెవెలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ఏర్పాటు చేసే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు దాసరి వెంకటశశికాంత్‌రెడ్డి(ఉడవగండ్ల) తనవంతు రూ.31,116 ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. పులివెందులలో ఉయ్యాలవాడ విగ్రహానికి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు రెడ్డి కమ్యూనిటీ దాతలు ముందుకు రావాలన్నారు.

గుండె జబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జమ్మలమడుగు : వయస్సుతో సంబంధంలేకుండా ప్రస్తుత జనరేషన్‌లో గుండె సంబంధిత జబ్బులు పెరిగిపోతున్నాయి. ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రఫిక్‌పాషా, సివిల్ సర్జన్ చంద్రకళలు తెలిపారు. మంగళవారం అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గుండె సంబంధమైన వ్యాధుల పట్ల రోగులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు.

గణనీయంగా తగ్గిన వేరుశనగ సాగు

- 50 శాతానికి పైగానే తగ్గిన సాగు విస్తీర్ణం
- సాగులో భారమవుతున్న పెట్టుబడులు
- వేరుశనగ సాగులో నష్టాలే అంటున్న రైతులు

వేముల : ఈ ఏడాది రబీలో వేరుశనగ సాగులో గణనీయంగా తగ్గిపోయింది. ఏడాదికేడాది రబీ వేరుశనగ సాగు తగ్గుతూ వస్తోంది. గత ఐదారేళ్లుగా రబీ వేరుశనగ సాగు 50 శాతానికి పైగానే తగ్గిపోయిందని వ్యవసాయ అధికారులు అంటున్నారు. రబీ వేరుశనగ సాగులో ఆశించిన మేర ఆదాయం రావడంలేదు. సాగు వాతావరణ పరిస్థితులు అనుకూలించడంలేదని, సాగులో నష్టాలు వస్తుండటంతో సాగుకు ఆసక్తి చూపడంలేదని రైతులు అంటున్నారు. గతంలో రబీలో వేరుశనగ పంట విస్తారంగా సాగయ్యేది.

50 శాతానికి పైగానే తగ్గిన సాగు విస్తీర్ణం

రబీలో వేరుశనగ పంట సాగు 50 శాతానికి పైగానే తగ్గిపోయింది. పంట సాగు చేసేందుకు పెట్టుబడులు పెరగడంతో రైతులు సాగుకు మొగ్గు చూపడంలేదు. వేరుశనగ పంటను నవంబర్, డిసెంబర్ మాసాల్లో సాగు చేస్తారు. పంట సాగు మొదలు దిగుబడులు వచ్చేవరకు అదనం ఖర్చులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. గతంలో పులివెందుల నియోజకవర్గంలో వేల ఎకరాలలో వేరుశనగ సాగయ్యేది. అయితే ప్రస్తుతం వందల ఎకరాలలో కూడా సాగు కావడంలేదు. నియోజకవర్గంలో వెయ్యి ఎకరాలకు మించి పంట సాగు కాలేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.



వేముల వద్ద సాగులో ఉన్న వేరుశనగ

సాగులో భారమవుతున్న పెట్టుబడులు

అధిక పెట్టుబడులతో కూడుకున్న పంట వేరుశనగ పంట. పంట సాగు మొదలు దిగుబడులు అందే సమయానికి ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు అవుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, కూలీ, మందులు, వేరుశనగ పంట పీకే కూలీ ఖర్చులు కలుపుకుని పెట్టుబడులు అవుతున్నాయి. పెట్టుబడులు పెరిగిపోవడంతో రైతులు వేరుశనగ సాగుపై దృష్టి సారించడంలేదు. సాగులో పెట్టుబడులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంటోందని రైతులు అంటున్నారు. పంట కాలం 110 రోజులు. వేరుశనగ సాగు చేస్తే రైతు శ్రమ ఎక్కువగా ఉంటోంది. వేరుశనగ పంటను బోర్లు, బావుల కింద సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రబీ సాగును డిసెంబర్ సాగుగా పిలుచుకుంటారు. అలాగే వ్యవసాయ పొలాలు నిస్సారమవుతున్నాయి. పంట సాగుకు రసాయనిక ఎరువుల వాడకం అధికమవుతోంది. ఒక్కోసారి రైతులు మోతాదుకు మించి రసాయానిక ఎరువులను వాడుతున్నారు. గతంలో పశువుల పేడ, కొండల్లో, గుట్టల్లో మట్టిని తోలి రైతులు పంటలను సాగు చేసేవారు. అధిక రసాయన ఎరువుల వాడకంతో పంటల సాగులో దిగుబడులు తగ్గుతున్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సాగులో తీవ్రంగా నష్టపోతున్నాం



రబీలో వేరుశనగ సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నాం. సాగులో పెట్టుబడులు అవుతున్నా ఆశించిన మేర దిగుబడులు రావడంలేదు. అలాగే కూలీ ఖర్చులు, ఎరువుల ధరలు పెరిగిపోయాయి. వేరుశనగ సాగులో నష్టాలు తప్ప ఆదాయం లేదు. దీంతోనే సాగుకు ఆసక్తి చూపలేకపోతున్నాం.

\- సుదర్శన్‌రెడ్డి, రైతు, గొందిపల్లె

సాగులో పెట్టుబడులు భారమవుతున్నాయి



వేరుశనగ సాగులో పెట్టుబడులు భారమవుతున్నాయి. ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు అవుతున్నాయి. పెట్టుబడులు పెట్టినా ధరలు లేక నష్టపోతున్నాం. ఎకరాకు 25 బస్తాలకు మించి దిగుబడులు రావడంలేదు. వేరుశనగ సాగు చేస్తే ఎకరాకు రూ.10 వేలకుపైనే నష్టాలే వస్తున్నాయి. దీంతోనే సాగుకు ఆసక్తి చూపలేకున్నాం.

\- రమణారెడ్డి,రైతు, గొందిపల్లె

శనగలో పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాల్లో తూకాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ముద్దనూరు : మండలంలోని నల్లబల్లె గ్రామంలో మంగళవారం వ్యవసాయాధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. గ్రామంలో పొలంల పిలుస్తోంది కార్యక్రమంలో శనగ పంటలో 5 గీ5 మీటర్ల కొలతలో పంట కోత కోయించి నూర్పిడి చేశారు. అనతరం శనగ పంట దిగుబడులను అంచనావేసినట్లు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైతులు బీమా కంపెనీ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురం : పంటకోత ప్రయోగాలను పక్కాగా చేపట్టాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం తురకపల్లె, నల్లింగాయపల్లెలో జరిగిన పొలం పిలుస్తోంది... కార్యక్రమంలో ఆమె పంటకోత ప్రయోగాలను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. పంటకోత ప్రయోగాలను పక్కాగా చేపట్టాలని, తద్వారా దిగుబడిని అంచనా వేయవచ్చన్నారు. దిగుబడులు ఎక్కువైతే ఎగుమతి చేసుకోవడం, అలాగే దిగుబడులు తగ్గితే ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం జరుగు తుందన్నారు. పంటలను సాగు చేసిన ప్రతి రైతు ఇ-పంట నమోదు చేసుకోవడంతో పాటు ఇ-కేవైసీ తప్పని సరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోతి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోతి హాజరై మాట్లాడుతూ మారిన జీవనశైలి, వివిధ రకాల ఆహారపుఅలవాట్లవలన పురుషులు, మహిళలు అనే లింగభేదం లేకుండా క్యాన్సర్ వ్యాధికి గురవుతున్నారన్నారు. కణాల పెరుగుదలలో నియంత్రణ లేకుండా పెరిగి కణుతులను ఏర్పరిచి ప్రమాదకరమైన క్యాన్సర్‌గా మారుతోందన్నారు. శరీరంలోని ఏ అవయవంకైనా క్యాన్సర్ రావచ్చునని, చర్మం, శ్వాస, జీర్ణ, జనన వ్యవస్థలలోని ఉప కణకణాలు, దేహంలోని వివిధ గ్రంథులలో కూడా క్యాన్సర్ రావచ్చునన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను ఎలా గుర్తించవచ్చునో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డాక్టర్ సి.బాలనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

తొండూరు : క్యాన్సర్ నివారణలో అవరోధాలను అధిగమిద్దామని పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా హాజరై మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వచ్చి చేసే క్యాన్సర్ పరీక్షలకు ప్రజలు సహకరించి అందరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధులను త్వరగా గుర్తించడం, చికిత్స త్వరగా ప్రారంభించడానికి వీలవుతుందన్నారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలతో కలిసి క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ, సీహెచ్‌ఓలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వేంపల్లె : ర్యాలీలో వైద్య, ఆరోగ్య సిబ్బంది

క్యాన్సర్ వ్యాధిపై ర్యాలీ

వేంపల్లె : క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు తాళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వాతిసాయి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా తాళ్లపల్లిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 4 ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని, క్యాన్సర్ బారిన పడకూడదంటే ప్రజలంతా ఈవ్యాధిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ షఫిఉన్నిషా, సూపర్వైజర్లు, సిహెచ్‌ఓలు, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

వేముల : పంటల సాగులో ప్రకృతి వ్యవసాయంవైపు రైతులు దృష్టి సారించాలని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వేములలో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన వేరుశనగ పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంవల్ల తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. పంటలు పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగుల నివారణకు మీమాత్రం పిచికారి చేయాలన్నారు. పసుపు, జిగురు అట్టలు లద్దె పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలను పెట్టుకోవాలన్నారు. పంటల సాగులో ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడటంవల్ల భూములు నిస్సారంగా మారడంతో దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. దీన్ని అధిగమనించాలంటే ప్రకృతి వ్యవసాయమే లక్ష్యంగా చేసుకుని పంటలను సాగు చేయాలన్నారు. అలాగే జొన్న పంటను పరిశీలించి పంటలో జీవామృతం పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి

కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు

వేంపల్లె : పదవులు అనేవి చిన్నవి, పెద్దవి అని తేడా లేకుండా కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రఓబుల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక గండి రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న 47 మంది క్రియాశీలక సభ్యులతో మండల నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పదవులు అలంకరించిన వారందరూ పార్టీ కోసం సమష్టిగా కృషి చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహణ సభ్యులు కటిక చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షులు మునీర్‌బాషా, రవిశంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య, రాజ్ కుమార్, దర్బార్ వల్లి, శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శులు గణేష్, నిస్సార్‌బాషా, కమతం రాజా, హబీబుల్లా, చంద్రఓబుల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్ర ఓబుళరెడ్డి

పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

పులివెందుల రూరల్ : పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని పార్టీ పదవులు పొందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయ సమీపంలో వైఎస్సార్‌సీపీలో పదవులు పొందిన వారికి వైఎస్సార్‌సీపీ నూర్ బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మాపై నమ్మకంతో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిలు ఈ పదవులు కట్టపెట్టినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డిలు పదవులు పొందిన జిల్లా ఉపాధ్యక్షుడు డి.శశికాంత్‌రెడ్డి, కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలను సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మాజీ డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్లపల్లి కిశోర్, కోఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, చంద్రమౌళి, నాగరాజు, కనక, చలపతి, కోళ్ల భాస్కర్, ఫైర్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

మండల సమావేశం 9వ తేదీకి మార్పు

చింతకొమ్మదిన్నె : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీ నుంచి 9వ తేదీకి మార్పు చేసినట్లు ఎంపీడీఓ కుల్లాయిబాబు తెలిపారు. జనవరి 31వ తేదీ నుంచి పార్లమెంటు సమావేశాలు నిర్వహిస్తున్నందున సెలవు దినములలో మాత్రమే సర్వసభ్య సమావేశం నిర్వహించవలసి ఉంటుందని, ఈ కారణంగా 10న జరగవలసిన సర్వసభ్య సమావేశం 9వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సభ భవనంలో నిర్వహించనున్నామని తెలిపారు.

ఉపాధి కూలి రోజుకు రూ.700 పెంచాలి

జమ్మలమడుగు : ఉపాధి కూలీలకు రోజుకు రూ.700 కూలి పడేవిధంగా చూడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడా నేతలకు పనులు చేయించి అధికారులు వాటిని ఉపాధి హామీపనుల్లో చూపించడం సిగ్గుచేటు అన్నారు. వేసవి కాలంలో రైతు కూలీలకు పనులు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి గ్రామాల్లోనే పనులు చూపించడం కోసం తాము సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఉపాధి హామీలో యంత్రాలను నిశేధించాలన్నారు. పనులు చేయించుకున్న వారం రోజుల్లో పోస్టాఫీసులో వారి ఖాతాలలో జమఅయ్యేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో బడా నేతలు సొంత పనులు చేయించుకుని వాటిని అధికారులతో ఉపాధి హామీపనుల కింద పెడుతున్నారన్నారు. వీటిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కడప రాయుని తిరునాలలో భారీ అన్నదానం



అన్నదానం చేస్తున్న భక్తులు

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆ క్షేత్రంలో స్థానిక పవన్ లక్ష్మి వెంకటేశ్వర టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. దివంగత పుత్తా ప్రవీణ్‌కుమార్ రెడ్డి సంస్మరణగా వరుసగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 13వ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎం కేశవకుమార్, మురుగేశన్, కదిరి ప్రసాద్, పుత్తా సులోచనమ్మ, పుత్తా పవన్‌కుమార్‌రెడ్డిలు అతిథులుగా హాజరై స్వయంగా అన్నదానం చేశారు.

ఆర్‌ఎంపీ వైద్యులపై ప్రత్యేక నిఘా

ఎర్రగుంట్ల : నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ మేరకు ఎర్రగుంట్ల అర్బన్ హెల్త్ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఆర్‌ఎంపీలు ఎలాంటి యాంటిబయెటిక్స్ మందులు, సూదలు వేయరాదని, ఫ్లూయిడ్స్ కూడా పెట్టరాదని, కనీసం ఇంజెక్షనులు కూడా వేయరాదని నిబంధనలు ఉన్నాయి. పట్టణంలో కొందరు ఏకంగా ఎక్స్‌రేలు, ఈసీజీలు, ల్యాబ్‌లను కూడా నిర్వహిస్తున్నారు. ప్రతి చిన్న రోగం వచ్చిన రోగులు మాత్రం ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు వేసిన సూది వికటించి చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే. పట్టణంలోని రాణీవనంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి 24 గంటలు అందుబాటులో ఉంటుంది. అలాగే వ్యవసాయ మార్కెట్ యార్డులో కూడా అర్బన్ హెల్త్ కేంద్రం కూడా అందుబాటులో ఉంది. ఆర్‌ఎంపీల ప్రథమి చికిత్స కేంద్రాలపై తనిఖీలు చేపట్టాం. ప్రజలు గమనించి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందాలి.

ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

వేంపల్లె : రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు బిఎస్ రమణారెడ్డి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల గుర్తింపుకు 8 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు, అగ్నిమాపక నిరభ్యంతర సర్టిఫికెట్ గడువును కూడా పెంచాలని విన్నవించారు. అలాగే ఉపాధ్యాయుల సంక్షేమం, లీజు డీడ్ రిజిస్ట్రేషన్, తెలుగు మీడియం అనుమతి తదితర అంశాలపై మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

కమలాపురం : ప్రస్తుత పోటీ తరుణంలో రాణించాలంటే ప్రతి విద్యార్థి సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన టెక్‌వేవ్-2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నూతన టెక్నాలజీతో తయారు చేసిన 40 ప్రాజెక్టులను, 20 ఎలక్ట్రానిక్ గేమ్స్‌ను పరిశీలించి మాట్లాడారు. కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టడం హర్షణీయం అన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులన్నీ బాగున్నాయని కొనియాడారు. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో ప్రజలకు అధిక లబ్ధి చేకూరే విధంగా ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. అలాగే పర్యావరణంలో కాలుష్య నివారణకు మంచి నమూనాలు తయారు చేయాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్రంలో ఎన్నో కళాశాలలు ఉన్నప్పటికి కమలాపురంలో టెక్‌వేవ్-2025 నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇటీవల కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులకు ప్రకటించిన రూ.10వేల నగదును ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ఓహెచ్‌డీ వెంకటేశ్వర్లు సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పాలి టెక్ ఫెస్ట్‌లో తమ విద్యార్థులు స్మార్ట్ మెడిసిన్ డెలివరి ప్రాజెక్ట్‌ను తయారు చేసి ద్వితీయ స్థానంలో వచ్చినందుకు మంత్రి లోకేష్ చేతుల మీదుగా రూ.50వేలు నగదు బహుమతి వచ్చిందన్నారు. అలాగే జోన్ స్థాయిలో జరిగిన ఫెస్ట్‌లో స్మార్ట్ లగేజ్‌కు ఫస్ట్ ప్లేస్‌లో రావడంతో రూ.25వేలు నగదు బహుమతి వచ్చిందన్నారు. చాలా మంది విద్యార్థులకు ఇంజినీరింగ్ గురించి తెలియదని, అందుకే టెన్త్ క్లాస్ విద్యార్థులకు కూడా వీటిపై అవగాహన కలిగించేందుకు వారిని ఆహ్వానించామన్నారు. కమలాపురంతో పాటు ఖాజీపేట, మైదుకూరు, వల్లూరు, ఎర్రగుంట్ల, వీఎన్‌పల్లె మండలాల విద్యార్థులు దాదాపు 2000 మంది వచ్చి ప్రాజెక్టులను వీక్షించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



తాను తయారు చేసిన ప్రాజెక్ట్ గురించి ఎమ్మెల్యేకు వివరిస్తున్న విద్యార్థిని

దోమల నియంత్రణ మనందరి బాధ్యత

తొండూరు : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ముంతాజ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమం సందర్భంగా డాక్టర్ ముంతాజ్ రక్తహీనత ప్రాముఖ్యత గురించి వివరించారు. దోమ కాటు వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధకాలు, మెదడు వాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య మాట్లాడుతూ దోమల లార్వా నిర్మూలన కొరకు ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ పనికిరాని గుంతలను, లోతట్టు ప్రదేశాలను, వాడని బావులను పూడ్చి నీరు నిల్వకుండా చూడాలన్నారు. అంతకమునుపు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించి క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుభద్రమ్మ, అరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ ముంతాజ్

భ్రూణ హత్యల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

వేంపల్లె : భ్రూణ హత్యల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు స్వాతిసాయి తెలిపారు. గర్భ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, లింగ సమానత్వం, బాల్య వివాహాలు అరికట్టడం, ఫోక్సో చట్టం, మహిళల చట్టం తదితర అంశాలకు సంబంధించిన బేటీ బచావో-భేటీ పడావోపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఆశా డే సందర్భంగా తాళ్లపల్లె పీహెచ్‌సీలో డిప్యూటీ డెమో అధికారిణి రమణమ్మ మాట్లాడుతూ ఆడ, మగ ఇద్దరు సమానమేనని భావించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే గుర్తింపు రద్దుతోపాటు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తారన్నారు. అంతేకాకుండా ఫుడ్ ఫోర్టిఫికేషన్, ఎనీమియా ముక్త్ భారత్, విటమిన్ ఏ లోపంపై డాక్టర్ స్వాతిసాయి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నిజాముద్దీన్, హెచ్ఈ షఫిఉన్నిషా, సిహెచ్ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ స్వాతిసాయి